క్లుప్తంగా

మే 12న మాలల మహా రణభేరి


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: వచ్చే నెల 12న కాకినాడలో మాలల మహా రణభేరి నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పండు అశోకుమార్, జిల్లా జేఏసీ అధ్యక్షులు బుంగ సతీష్‌కుమార్, లింగం ప్రసాద్, మాతా సుబ్రహ్మణ్యం, కండవల్లి లోవరాజు వెల్లడించారు. శుక్రవారం కాకినాడలో మహా రణభేరి కరపత్రాలను వారు విడుదల చేశారు. రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పీవీ రావు 73వ జయంతి సందర్భంగా కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ మైదానంలో మాలల మహా రణభేరి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించి, ఎస్సీ వర్గీకరణకు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించకుండా, రిజర్వేషన్ అమలు చేసే విధంగా చూస్తున్నారన్నారు. ఈ రణభేరి కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ మనవడు భీమారావు యశ్వంత్ అంబేడ్కర్, మండల చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీ పండు రవీంద్రబాబు, తెలంగాణ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ ఎంపీ జీవీ హరిష్ కుమార్ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో భానుమతి, గుంటూరు శ్యామ్, బచ్చల కామేశ్వరరావు, శ్యామ్, చిట్టిబాబు, కనికెల సూర్యనారాయణ, నేతల హరిబాబు, కాకిలేటి రవీంద్ర, దేవబత్తుల దానియేలు, రాయుడు థామస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ పిఠాపురం సహాయ సంచాలకులు స్వాతి అన్నారు. మండలంలోని ఇసుకపల్లి, యండపల్లి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. ధాన్యం కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల సేవలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మధ్యవర్తులు, దళారులకంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 75 కేజీల ధాన్యం బస్తాకు రకాన్ని బట్టి సుమారు రూ.1,725కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తారని చెప్పారు. మండల వ్యవసాయాధికారి జోగిరాజు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


రత్నాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ ఎస్ రత్నాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతపై అన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల సామాజిక వర్గీయులంతా కలిసి రావాలని రత్నాకర్ పిలుపునిచ్చారు.


వేళంగి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


రమణయ్యపేటలో భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు


రామారావుపేట ఫెలోషిప్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు


రమణయ్యపేట బాలాజీనగర్‌లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

సర్వలోక రక్షకుడు ఏసు

- ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు

కరప: పాపులను సన్మార్గంలో పెట్టడానికి, వారిని పాప విముక్తులను చేయడానికి క్రీస్తు చేసిన త్యాగాలు ఎనలేనివి. ముళ్ల కిరీటాన్ని ధరించినా.. సిలువనెత్తి రక్తాన్ని చిందించినా.. చిరునవ్వుతో పాపుల క్షేమాన్నే కోరుకున్నారు. ఆ దయామయుని సిలువ మోసిన రోజును స్మరించుకుంటూ క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను నిర్వహించారు. సర్వలోక రక్షణ కోసం , సమస్త మానవాళి పాప పరిహారం కోసం కల్వరి సిలువపై ప్రాణత్యాగం చేసిన మహోన్నతుడు ఏసు ప్రభువు అని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పి.ప్రసాద్‌బాబు అన్నారు. వేళంగిలోని క్రైస్ట్ చాపల్ చర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు భక్తి,శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. యండమూరు గాస్పల్ బాప్టిస్ట్ చర్చిలో రెవ.ఐ.జాన్ సూర్యప్రకాష్, కరపలో ఫెయిత్ గాస్పెల్ చర్చిలో బిషప్ కె.అబ్రహాం సామ్యూల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేళంగిలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ నరేష్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ప్రార్థించారు. పవిత్ర శుక్రవారం ఏసుక్రీస్తును అన్యాయంగా సిలువ వేయడాన్ని, మరణం తర్వాత మృత్యువును జయించి మూడో రోజు లేచినట్టు వివరించారు. క్రైస్తవులు ఉపవాసంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉపవాస దీక్షను విరమించి, ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ డాక్టర్ పి.శామ్యూల్ రాజు, ట్రెజరర్ ఆర్.ప్రతాప్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.ఏసురత్నం, భరత్‌కుమార్, కె.శేఖర్ మోజెస్, జె.పాల్‌ప్రసాద్, డాక్టర్ స్టీఫెన్‌బాబు, పీవీ ఇమ్మానియేల్ తదితరులు ఏసు బోధనలు వినిపించారు. నడకుదురులోని బిలీవర్స్ చర్చిలో మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఫాదర్ మేడపాటి రాజ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేసి, దైవాశీర్వాదాలు అందించారు.

క్రీస్తు త్యాగాలకు ప్రతీక

కాకినాడ రూరల్: ఏసుక్రీస్తు త్యాగాలకు ప్రతీకగా శుభ శుక్రవారం నిలుస్తుందని డాక్టర్ సువర్ణరాజు అన్నారు. స్థానిక రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులకు భోజనం సదుపాయం కల్పించారు. డాక్టర్ సువర్ణరాజు మాట్లాడుతూ చెడు నుంచి మంచి వైపు ప్రజలను నడిపించేందుకు ఏసుక్రీస్తు శ్రమించారన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

పండూరులో సిలువ యాత్ర

మండలంలోని పండూరు గ్రామంలో కల్వరి సిలువ యాత్రను నిర్వహించారు. రక్తం చిందిస్తూ ఏసుక్రీస్తు సాగించిన సిలువ యాత్రను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. గ్రామంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. జాక్సన్ మినిస్ట్రీస్ పెంతుకోస్తు ప్రార్థన మందిరం పాస్టర్ కె.రవి జయంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిలువ యాత్రలో ఏసు ప్రభువుగా కొలువురి విజయ్ అప్పట్లో ఏసుక్రీస్తు పడిన బాధలను, శ్రమలను ప్రదర్శించారు. సుమారు 500 మంది సంఘ సభ్యులు గ్రామంలో వీధివీధినా తిరిగారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. 40 రోజుల శ్రమ దినాలు అనంతరం శుభ శుక్రవారం జరుపుకొంటున్నామని పాస్టర్ రవి జయంత్ తెలిపారు. రమణయ్యపేట బాలాజీ నగర్‌లో ఫెయిత్ జెరుషలేము ప్రార్థనా మందిరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనా కార్యక్రమం జరిగింది. పాస్టర్లు రెవ.సమర్పణరావు, అవినాష్ పాల్ మాట్లాడుతూ, పాప మార్గంలో నడుస్తున్న జనులను రక్షించేందుకే ఏసు క్రీస్తు ప్రాణ త్యాగం చేశారన్నారు.


పండూరులో నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు సిలువ యాత్ర

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

- ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు
- ముగిసిన శ్రమదినాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గుడ్ ఫ్రైడే సందర్భంగా కాకినాడ నగరంలో చర్చిల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఏసు క్రీస్తును ధ్యానిస్తూ ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఆరాధనల్లో క్రైస్తవులు ఉపవాసం ఉంచి, ప్రార్థనలు చేశారు. దైవజనులు ప్రత్యేక సందేశాలు అందించారు. క్వయర్ వారు ప్రత్యేక గీతాలు ఆలపించారు. రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ డోమినిక్ సావియో ఆధ్వర్యంలో నగరంలోని పలు వీధుల్లో క్రైస్తవులు సిలువను పట్టుకుని, పాటలు పాడుతూ ఏసు క్రీస్తును స్మరించుకున్నారు. నగరంలో అర్బన్ ఎమ్మార్వో భవన్ సమీపంలోని క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి, రామారావుపేటలోని ఫెలోషిప్ చర్చి, సెయింట్ లూథరన్ చర్చి, గాంధీనగర్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, జగన్నాథపురంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి, రోమన్ కేథలిక్ చర్చి, చీడీలపొరలోని షాలోమ్ ప్రేయర్ హౌస్, రిజర్వ్‌లైన్స్ పోలీస్ క్వార్టర్స్ బాప్టిస్టు చర్చి, ఏపీఎస్పీ యూనియన్ బాప్టిస్టు చర్చి, పీస్‌మేకర్స్ మినిస్ట్రీస్ చర్చి, క్రేగ్ ఇమ్మానుయేల్ చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ డి.వరప్రసాద్, సంఘ నాయకులు డానియేల్ దినకర్ జాసన్, ఎం.వినోద్‌కుమార్, కె.రంజిత్‌కుమార్, రిజర్వులైన్స్ పోలీస్ యూనియర్ చర్చి పాస్టర్ ఎం.చంద్రపాల్, హౌస్ ఆఫ్ ప్రేయర్‌లో పాస్టర్ విజయ్‌కుమార్, మోజెస్, గాంధీనగర్ తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ బీవీ రాజు, బెరాకా బెస్సింగ్స్ చర్చిలో పాస్టర్ జోసఫ్‌బెన్ని, షాలేమ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ శామ్యూల్ విక్టర్, రేస్ ఆఫ్ పీస్ చర్చిలో పాస్టర్ మూర్తిరాజు, రామారావుపేట లూథరన్ చర్చిలో శామ్యూల్‌రాజు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ఆరాధనల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఈస్టర్‌కు 40 రోజుల ముందు ప్రారంభమైన శ్రమ దినాలు గుడ్ ఫ్రైడేతో ముగిశాయి.


రోమన్ కేథలిక్ చర్చి ఆధ్వర్యంలో నగర వీధుల్లో నిర్వహిస్తున్న సిలువ యాత్ర

అధ్వానంగా ఉన్నా.. పట్టించుకోరా?


పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న పార్కును చూపుతున్న ప్రభాకరరావు

బోట్‌క్లబ్: పార్కు అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదని సిద్ధార్థనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి బసవా ప్రభాకరరావు వాపోయారు. పిచ్చిమొక్కలకు, విష జంతువులకు పార్కు నిలయంగా మారిందని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వయంగా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మందికి ఉపయోగంగా ఉండే ఈ పార్కు ప్రస్తుతం అడుగుపెట్టలేని పరిస్థితుల్లో ఉందన్నారు. చీకటిపడితే విష పురుగులు సైతం ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. ఈ పార్కులో కొందరు అక్రమంగా షెడ్లు నిర్మించుకున్నారని, కార్పొరేషన్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

దినచర్యలో వ్యాయామం భాగం కావాలి

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ వ్యాయామం దినచర్యలో భాగం కావాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రామారావుపేటలోని వైఎస్సార్ షటిల్ స్టేడియంలో శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వ్యాయామ దినోత్సవం సందర్భంగా క్రీడల పోటీలు నిర్వహించారు. వ్యాయామం గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. ఎముకలను బలపరచి, వృద్ధాప్యంలో పెళుసుదనం, ఆస్టియోపోరోసిస్‌ను నివారిస్తుందన్నారు. శారీరక శక్తిని, మానసిక స్థితిని మెరుగుపరుస్తుందన్నారు. ప్రముఖ షటిల్ క్రీడాకారులు కొర్లపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ, గతంలో సగటు వ్యక్తికి వ్యాయామం వారి దినచర్యలో భాగంగా ఉండేదని చెప్పారు. నీళ్లు తెచ్చుకోవడం, తోటపని, వంట పని, మార్కెట్‌కు నడచి వెళ్లడం వంటి శారీరక కార్యకలాపాలు ఉండేవన్నారు. నేటి సాంకేతిక యుగంలో, అవసరమైనది ఏదైనా ఇంటి వద్దకే డెలివరీ రావడంతో తగినంత శారీరక వ్యాయామం పొందడం కష్టంగా మారిందన్నారు. దీనివల్ల పలు అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు శ్రీనివాస్, చైతన్య, కృష్ణంరాజు, కిషన్, కిరణ్, ప్రదీప్, సందీప్ పాల్గొన్నారు.


షటిల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పోలీసు స్టేషన్ వద్ద ధర్నా

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ వద్ద శుక్రవారం బాధితుడి బంధువులు, కాలనీవాసులు ధర్నా చేశారు. జనచైతన్య లేఅవుట్ గాంధీ బొమ్మ కాలనీకి చెందిన జనిపల్లి శ్రీనుపై దాడికి పాల్పడిన కిరాణా షాపు యజమాని, అతని అనుచరుడిపై కేసు నమోదు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. గాయపడిన శ్రీను కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు చెప్పారు. ధర్నాలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ, శ్రీనుపై దాడికి పాల్పడిన కిరాణా వ్యాపారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎస్సై వీరబాబు మాట్లాడుతూ, కిరాణా దుకాణం వద్ద గురువారం సరకుల కొనుగోలుకు రూ.500 నోటు ఇవ్వగా, తిరిగిచ్చిన బ్యాలెన్స్ సొమ్ములో రూ.200 నోటుపై సిరా మరక ఉందని, మరో నోటు ఇవ్వాలని వ్యాపారిని కోరగా, శ్రీనుపై దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. బాధితుడు జీజీహెచ్‌లో కోలుకుంటున్నట్టు తెలిపారు.

జూదరుల అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని గైగోలుపాడు ఎస్‌బీఐ కాలనీలో పేకాట శిబిరంపై సర్పవరం పోలీసులు శుక్రవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.20,600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పెద్దిరాజు తెలిపారు.

నాకా బందీలో 61 వాహనాలు సీజ్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి 9 నుంచి 11 గంటల మధ్య జరిగిన నాకా బందీలో పోలీసులు మొత్తం 2,223 వాహనాలు తనిఖీ చేశారు. వీటిలో వివిధ కారణాలతో 61 వాహనాలు సీజ్ చేయగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్టు 15 కేసులు నమోదయ్యాయి. అలాగే పెద్దాపురం పీఎస్ పరిధిలో పది గోవులను తరలిస్తున్న మరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి జంతు హింస చట్టం కింద కేసు నమోదు చేశారు.

దళారులు ధాన్యం కొంటే క్రిమినల్ కేసులు


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నాయక్

పిఠాపురం: దళారులు తక్కువ ధరకు ధాన్యం కొంటే క్రిమినల్ కేసులు పెడతామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీ నాయక్ హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పిఠాపురం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కళ్లాల్లోని ధాన్యం రాశులను పరిశీలించి, ధాన్యం కొనుగోలు సిబ్బందికి పలు సూచనలు చేశారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని సత్వరం పట్టుబడి చేసి, మిల్లులకు పంపాల్సిందిగా ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యం షావుకారులు కానీ, మిల్లర్లు కానీ కొనాలని స్పష్టం చేశారు. మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోళ్లు జరుపుతున్నట్లు నిర్ధారణ అయితే అటువంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. పిఠాపురం మండలానికి అవసరమైన గోనె సంచులను పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలకు పంపించామన్నారు. కొనుగోలు సిబ్బంది అంతా రైతుల కళ్లాలకు వెళ్లి ధాన్యం నమూనాలను సేకరించాలని ఆదేశించారు. రైతులందరినీ అప్రమత్తం చేసి మద్దతు ధర, అంతకన్నా ఎక్కువ ధరకు మాత్రమే అమ్ముకొనేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పిఠాపురం మండల వ్యవసాయాధికారి ఎ.అచ్యుతరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

సమ్మర్.. బీ కేర్‌ఫుల్

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బతో పొంచిఉన్న ప్రాణాపాయం
- ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచిన యంత్రాంగం

కాకినాడ సిటీ: సాధారణంగా మేలో ఎండలు విపరీతంగా ఉంటాయి. పర్యావరణ విధ్వంసంతో వాతావరణంలో పలు మార్పులు వచ్చాయి. పచ్చని చెట్లు తగ్గి, భూగోళం వేడెక్కడంతో ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ముందస్తు సూచనలు విడుదల చేసింది. వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే వడదెబ్బ తగిలి ప్రాణాపాయం సంభవించే అవకాశముంది. కాకినాడ, కాకినాడ రూరల్ ప్రాంతాల్లోనే అత్యధికంగానే వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే కాకినాడ రూరల్, కరప మండలాల్లో కరప, వేళంగి, ఉండూరు, రమణయ్యపేట పీహెచ్‌సీల పరిధిలో 43 పంచాయతీల పరిధిలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలకు, చలివేంద్రాలను నిర్వహిస్తున్న ప్రదేశాల్లోను ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ ఇవి అందుబాటులో ఉంచి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

వడదెబ్బ తగిలేదిలా..

శరీరంలో ఐదు లీటర్ల మేర నీరుంది. శరీరంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు (98.6 ఫారెన్‌హీట్) ఉంటుంది. బాహ్య వాతావరణంలో 37 డిగ్రీలు దాటినప్పుడు శరీరం ఎండ ప్రభావానికి లోనవుతుంది. శరీరం సమతాస్థితిని కోల్పోయినప్పుడు నీరు తగ్గిపోతుంది. ఇలా బయటకు వెళ్లిన నీటిని భర్తీ చేయకపోతే జీవక్రియలు మందగిస్తాయి. ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని వైద్యులు చెబుతున్నారు. వడదెబ్బ తగిలితే.. తలనొప్పి, తలతిరగడం, పొడిచర్మంతో తీవ్ర జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, 106 డిగ్రీలు జ్వరం దాటగానే ఫిట్స్ వస్తాయి. దీంతో మనిషి పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్తాడు. బీపీ పూర్తిగా తగ్గిపోతుంది. బ్రెయిన్, కిడ్నీ ఫెయిల్ అవుతాయి. మూత్రం స్తంభించి ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది.


నిర్మానుష్యంగా మారిన కాకినాడ-రామచంద్రపురం రహదారి


ఓఆర్ఎస్ ప్యాకెట్లు

ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు

ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ ప్రభావానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశాం. వడదెబ్బ బాధితులకు వైద్యం అందించేందుకు ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, యాంటీ డయేరియల్ మందులు అందుబాటులో ఉంచాం. ప్రతి పీహెచ్‌సీ, అర్బన్ సీహెచ్‌సీల్లో రెండు పడకలు ప్రత్యేకంగా బాధితుల కోసం ఏర్పాటు చేయించాం.

– జె.నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ

డీహైడ్రేషన్ కలిగిస్తుంది

వడదెబ్బ బారిన పడిన వారు డీహైడ్రేషన్‌కు గురవుతారు. అటువంటి సమయంలో ముందుగా ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను వినియోగిస్తే కొంత వరకు కోలుకుంటారు. ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన పొడర్. దీనిని లీటరు సురక్షిత నీటిలో కలిపి రోజు మొత్తంలో వయసు ఆధారంగా తగిన మోతాదులో తాగాలి. మితిమీరిన మోతాదులో తాగితే అనర్థాలు జరిగే అవకాశం లేకపోలేదు.

– డాక్టర్ ఆర్ శ్రీనివాసనాయక్, పీహెచ్‌సీ, వేళంగి